# దేవుడున్నాడా?

—భానుశ్రీ

రాత్రి పదకొండు దాటింది చిక్కటి చీకటిని చీల్చుకుంటూ, నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ మధ్యమధ్య తన ఉనికితో ప్రయాణికులకు తమ ఉనికిని తెలియజేస్తూ దూసుకుపోతూంది ఎక్స్‌ప్రెస్. అప్పటికి పూర్తిగా ఆంధ్ర దాటిపోయి మహారాష్ట్రలో సగభాగాన్ని కూడ వెనక్కి నెట్టేసింది

ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో రెండవ నెంబరు రూమ్‌లో ఉన్న మీరా, మోహన్ చాలాదూరం ప్రయాణం చేశారు. ఏవోమాటలతో, ఛలోక్తులతో కాలం ఇట్టె గడిచిపోయింది.

ఇప్పుడు రాబోయేదే నాగపూర్. విజయవాడనుండి బోర్ కొట్టుకుంటూ ఒక్కర్తే ఎలా ప్రయాణం చేయగమా అని బెంగపెట్టుకొన్న నాకు విసుగనేది కలగకుండా మంచి కంపెనీ ఇచ్చేరు మీరు మెనీథాంక్స్.

బాగుంది మీరనేది. నేను కాకపోతే ఇంకెవ్వరూ దొరకరా. అంటినవ్వుతూ.

దొరికినా దొరక్కపోయినా మంచి కంపెనీ ఉండాలికదా. మీ సాహచర్యం వలన కాలం ఇట్టె గడిచిపోయింది.

ఆ మాటకొస్తే నేను వైజాగ్‌నుండి ఒక్కదాన్నే ప్రయాణిస్తున్నాను. విజయవాడ వరకు నాకు కంపెనీలేదు ఇంకమీదట ఉంటుందో లేదో తెలియదు. రేపంతా ఎలాగడపడమో. రియల్లీ యు ఆర్ ఎ లక్కీ ఫెలో అంది నవ్వుతూ వాచ్ చూసుకుంటూ.

ఆ దానికేముందిలెండి ఢిల్లీ వెళ్ళేలోగా ఎవ్వరూ ఎక్కకుండా ఉంటారా అయినా మీకు కంపెనీదొరకడం ఏం కష్టం?

నాగపూర్ స్టేషన్ రాగానే సూట్ కేస్ పట్టుకొని దిగిపోయాడతను.

ఏదో సంశయిస్తున్న వాడిలా నించోడం చూసి ఏమిటి ఏమయినా మర్చిపోయారా అడిగింది.

అబ్బే ఆదేంలేదండి మీకు అభ్యంతరం లేకపోతే మీ ఎడ్రసిస్తారా?...లెటర్స్ రాయడం నా ముఖ్యమయిన హాబీల్లో ఒకటి...అన్నాడు.

అంతేనా...దాందేముంది తీసుకోండి. అంటూ అతనిచ్చిన డైరీలో రాసిచ్చింది మరి మీ ఎడ్రెస్...అంది.

నేను రాసిన లెటర్‌లో రాస్తాను లెండి. ఐ యామ్ థాంకింగ్ యు...

ఆc-ఆc-చాల్లెండి...బై బై

కదిలిపోతున్న రైలుకి దూరమయిపోతున్న అతనికి చేయూపుతూ కనుమరుగయేవరకు ఉండిలోపలకు వచ్చింది పొద్దున్న విజయవాడలో ఎక్కేవరకు అతనంటే ఎవరో తనకు తెలియదు. తనెవరో అతనికి తెలియదు. కేవలం కొన్ని గంటలు ప్రయాణమే తమను కలిపి మళ్ళీవిడదీసింది అందుకే కొంతమంది మహానుభావులు జీవితాన్ని రైలు ప్రయాణంతో పోల్చారు— మధ్యలోనే ఎంతోమంది తటస్థపడి–విడిపోతుంటారు అందులో కొంతమంది ప్రత్యేక వ్యక్తులు తప్ప జీవితాంత కలిసిప్రయాణం చేయలేరు– అదేనా విధి అంటే...చస్– ఎమిటివాళ ఇలాంటి చచ్చు ఆలోచనలు వస్తున్నాయి– గదితలుపులు మూసి బెర్తు మీద బెడ్డింగ్ పరచి దానిమీదకూర్చుని కిటికీలోంచి చూస్తూ ఆలోచిస్తోంది ఇంతవరకు లేని ఒంటరితనం ఇప్పుడామెను బాధిస్తోంది. భయపెడుతోంది ప్రక్క రూములో ఎవరున్నారో?

అర్ధరాత్రి–ఒంటరిగా—బయట చుట్టుగాఢా ధకారం. ప్రక్కరూములో అందరూ నిద్రపోతున్నట్టున్నారు. రైలు చక్రాలధ్వని అప్పుడప్పుడు కీచురాళ్ళ రొదతప్పితే ఇంకేశబ్దం వినిపించడంలేదు. ఇలాంటి సమయంలో ఎవడయినా ప్రవేశించి ఏమయినా చేస్తే... తను అరిచినా ఎవరికీ వినబడక పోవచ్చు. సాధారణంగా ఫస్టుక్లాస్ కంపార్టుమెంటులోనే ఎలాంటి అఘాయిత్యాలయినా జరుగుతాయి. తను ఎన్నో నవలల్లో చదివింది, ఎన్నో సినిమాల్లో చూసింది, వాస్తవంగాకూడా జరిగాయని వింది...

ఒక్కసారి ఆమెఒళ్ళు జలదరించింది. ఏమిటిలావస్తున్నాయి పిచ్చాలోచనలు నిద్రపోతే బాగుంటును సినిమాల్లోని ...నవలల్లోని... ఎక్కడలేని సంఘటనలూ ఆలోచనలరూపంలో ఒక్కసారిగా ఉబికి వచ్చేస్తున్నాయి. ఆమెకు భయంఎక్కువవసాగింది

కిటికీలోంచి చల్లనిగాలివచ్చి ఆమెను రివ్వున తాకింది: మెల్లిగా లేచి షట్టర్స్ కూడ వేసేసి తలుపులన్నీ సరిగ్గాఉన్నాయోలేదో చూసి– వచ్చి దుప్పటి కప్పుకుని పడుకుంది.

ఆమెభయాన్ని చూసి నిద్రాదేవత నవ్వుకుంటూ అంత దూరంనించే

[తరువాయి 17వ పుట]

# దేవుడున్నాడా!

[8వ పుటనుండి]

చూస్తూంటేతప్ప దగ్గరకు రావడంలేదు. ఇదేగాబోలు పిల్లికి చెలగాటం ఎలుక్కి ప్రాణసంకటం అంటే?

ఇప్పుడామె తనంతట తానుగా తలుపుతీస్తేతప్ప చీమకూడా బయటినుండి రావడానికి ఆస్కారం లేదు- అయినా భయం గుండెల్ని పిడిస్తూనేఉంది- ఆలోచనలను దూరంచేయాలని బ్యాగ్‌లోంచి ఏదో నవలతీసి పట్టుకుంది- రెండు పేజీలు చదివిందిగాని ఆమె మెదడునిండా ఆక్రమించుకున్న ఆలోచనలు వాటిలోని మేటర్‌ని లోనికి రానివ్వలేదు-

మోహన్ ఉంటే ఎంత బాగుణ్ణు అనుకుందామె- పగలల్లా కంపెనీ ఉండి రాత్రి లేకపోవడం తన దురదృష్టం- కనీసం ఒకవ్యక్తి ఉన్నా తనకు భయం లేకపోను-

జీవితంలో ఎన్నోఎడ్వెంచర్స్ చేయడమన్నా, సమస్యలను, క్లిష్టపరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోడమన్నా తనకెంతో ఇష్టం- ఏవిధమైన థ్రిల్స్‌లేకుండా సాఫీగా హాయిగా ఖరీదైన సూట్లతో అందమైన భార్యలను వెంటబెట్టుకుని ఎక్కడలేని డాబులను ఒలకబోస్తూ ఇంపాలా కార్లలో తిరిగేజీవితం- అటువంటి మనుష్యులుఅంటే తనకసహ్యం-

పగలల్లా కష్టపడి ఎటువంటి అనవసరమైన కోరికలకుపోకఉన్న దాంతోనే భార్యాబిడ్డలతో హాయిగా తృప్తిగా గడుపుతూ చిన్న ఇళ్ళలో నివసించే జీవులంటే తన కిష్టం,

అయినా వాళ్ళిద్దర్లో ఎవరు అసలయిన ఇండియన్స్? సుఖంమాట అటుంచి కష్టమొకరిదైతే. ఫలితమొకరిది. ఇదేం న్యాయం.

పేదవాడు కష్టపడి సంపాదించిన ఫలితాల్ని అనుభవిస్తూ బొజ్జలు పెంచుకుంటూ కారులో తమముందు నించి వెళ్ళిపోయే ధనవంతులవైపు- ప్రక్కన నించుని ఆశగాచూసే వారికన్నులు- ఆ దరిద్ర పుత్రులకు కనిపించేది ఆశ. అమాయకత్వము కాదు, అసూయ. అసహ్యం.

ఆఫ్టరాల్ హీ ఈజ్ ఎ లేబరర్ తనకన్యాయం జరిగిందని అరవబోయినా డబ్బునే పాదరక్షతో ధనవంతుడొక్క మొట్టు మొట్టాడంటే కిక్కురుమనకుండా ఊరుకోవడం తప్పించి ఇంకేం చేయగలడు అభాగ్యుడు! ఎక్కడుంది సోషలిజం? ఇండియాలో అది ఎప్పటికి వస్తుంది? ఇదంతా సోషలిజమే! ధనవంతుడు మరీ ధనవంతుడై ..సామాన్యుడు మరీ సామాన్యుడై పోతున్నాడు ఆకలి చావులు సజావుగా సాగిపోతునే ఉన్నాయి! సానుభూతి చితిమండుతూనే ఉంది.

పోనీ ఈ కాపిటలిస్టులు ఇక్కడేదో సంపాదించేరాయని విర్రవీగుతున్నా విదేశాలలో ప్రచారమవుతున్నది ఇక్కడి పూర్ హట్స్, డర్టీప్లేసెస్! చేప్ మెంక్స్‌మీద, బస్టాప్‌లలోను ఎక్కడ పడితే అక్కడ నివాసమేర్పరచుకునే అభాగ్యులే అక్కడ "ఇండియన్స్"గా పిలవబడుతున్నారు.

అసలు భారతదేశానికున్న సౌందర్యం, సంస్కృతి, సంపద ఔన్నత్యం ఏ దేశానికీ లేదు! కాని ఇప్పుడవన్నీ ఎక్కడున్నాయి? ఆ సౌందర్యం, ఔన్నత్యం ఏ మురికి ప్రదేశం వెనక దాక్కుంది? ఆ సంస్కృతిఅంతా ఏ పేదవాడి, ఏ ధనవంతుని హృదయంలో నక్కింది? ఆ ఔన్నత్యమంతా ఏ అభాగ్యుని గుడిసె వెనక్కుపోయింది?

పూర్వం ఎప్పుడో ఇక్కడ వీధుల్లోనే ముత్యాలు, రత్నాలు రాసులుగా పోసి అమ్మేవారట! అది నిజమో, అబద్ధమోగాని ఈనాడది మనకు కేవలం ఒక సుందర స్వప్నంగా మిగిలిపోయింది! ఇప్పుడు ఇండియా అలాగ ఉండేటట్లయితే ప్రపంచంలో మిక్కిలి ధనవంతమైన దేశాల్లో అగ్రస్థానం వహించి ఉండేది,

పూరిగుడిసెల్లో కూటికి గుడ్డకు దిక్కులేక బాధపడే అభాగ్యుని ఆకలి ఆక్రందన - ప్రక్కనే పెద్ద భవంతిలో ఏ అంతస్తులోనో టేబుల్ ముందు కూర్చుని ఖరీదైన భోజనంచేసే పెద్ద మనిషికి వినబడిననాడు ఆ "కల" కొంతైనా నిజం కాకపోతుందా?

ఆ విషయం తల్చుకున్నపుడల్లా ఆమె రక్తం వేడిగా ప్రవహిస్తుంది. హృదయం ఉత్సాహంతో ముందుకు ఉరుకుతుంది.

ఆలోచనలు కొత్త పంథా తొక్కడంతో తాత్కాలికంగా ఆమె భయాన్ని మరచిపోయింది,

నిజంగా నీరా అన్నట్టు భగవంతుడనే వాడుంటే అయనిచ్చిన సంపదను ఇలా కేవలం కొంతమందే అనుభవించేటట్టు ఎందుకు చేశాడు? ఏమైనఅంటే లిఖితం కర్మ అంటూ తేల్చేస్తుంది నీరా. ఈ భేదాలు ఇప్పుడేకాదు. సృష్టి మొదలైన దగ్గరనుండి ఉన్నాయంటుంది, ఎప్పుడో భారతదేశం భాగ్యవంతంగా ఉన్నప్పుడుకూడా రాజు పేద అనే భేదభావాలుండేవి అనేది,

[తరువాయి 20వ పుటలో]

# దేవుడున్నాడా!

[17వ పుటనుండి]

ఏమిటో దేవుడున్నాడని ఆమెకం తనమ్మకం! సడన్‌గా ఆలోచనలు నీరా వైపుకి మళ్ళాయి.

ఆ స్నేహశీలి, ఆత్మీయురాలు నీరా లేకపోతే ఆ పరాయి ప్రదేశంలో తానేమైపోయేది? ఆ రోజు ఆదివారం...

హాస్టల్ ఎదురుగానున్న పార్క్‌లో ఒక పొదపక్కన ఏదో ఆలోచిస్తూ కూర్చుంది. తనక్కడ జాయినయి రెండు నెలలయినా ఎవరితోనూ స్నేహంలేదు అసలు విదేశీయులందరికీ ఇండియన్స్ అంటే చులకనభావం అందుకనే నార్త్ ఇండియన్స్‌కీ-సౌత్ ఇండియన్స్ అంటే చిన్న చూపు, ఆ విషయం తల్చుకున్నపుడల్లా ఆంధ్రా యూనివర్శిటీ మీదా మెకు విపరీతమైన కోపం వచ్చేస్తుంది. తన దురదృష్టంకొద్దీ సైకాలజీలో సీటు ఒక్క నెంబర్లో తప్పిపోవాలా! ఇంకా ఎకనమిక్స్ సోషియాలజీలలో వచ్చినా చదవాలనిపించలేదు. పోనీ మిగతా యూనివర్శిటీలలో-టైమ్ లేకపోయినా ట్రైయిచేసి చూస్తే-చివరకు విసిరేసినట్లు ఢిల్లీలో దొరికింది,

తనంత దూరం రావడం ఇంట్లో ఎవరికీ ఇష్టంలేదు కాని తను మాత్రం చాల సరదాపడింది. హాస్టల్ జీవితం రంగు రంగుల్లో సీతాకోకచిలుకల్లా మెరిసిపోయే అందమైన అమ్మాయిలతో కూడిన సార్ట్...!ఓహో! బంగారు కలలతో, తీయని ఆశలతో ఢిల్లీలో అడుగుపెట్టిన మీరాకు నిరాశ మిగిలింది. తనది అసలు రిజర్వ్‌డ్ స్వభావం కాదు వాళ్ళలో వాళ్ళు ఎంతగానో కలిసి ఉంటారు! మరి తననెందుకలా నిర్లక్ష్యంగా, నిరసనగా చూడ్డం!?

"చూడు కమలా, ఈ అమ్మాయి నెక్కడో చూసినట్లుందికదూ!

ఏదో ఆలోచిస్తున్న మీరా తెలుగు మాట వినడంతో ఉలిక్కిపడింది. ఆమె హృదయంపై పన్నీటి జల్లు కురిసినట్లనిపించింది. వారెవరైనా కాని ఒక్క పరుగున వెళ్ళి కౌగిలించుకోవాలనిపించింది ఆశ్చర్యం. ఆనందం పోటీలు పడి ముఖంపై నాట్యం చేయగా వెనుతిరిగి చూసిందామె!

ఇంచుమించు తన ఈడుదే ఒక అమ్మాయి ఖరీదైన బెల్ బాటమ్స్, షార్ట్ హెయిర్‌తో ఎంతో అందంగా ఉంది, ఆమె తల్లిదండ్రి కాబోలు ప్రక్కన నడుస్తున్నారు.

"నమస్కారం" అంది తనువారు దగ్గరకు రాగానె ఎవరో తెలియకపోయినా.

"చూడమ్మా, నువ్వు, గోపాలరావుగారి అమ్మాయివికదూ" అన్నారాయన,

"అవునండీ!" అంది ఆశ్చర్యంగా.

"చూశావా కమలా, నాపంతెం నెగ్గింది. ఈమె గోపాల్ కూతురే. ఆం చూడమ్మాయ్! నేను మీనాన్నా క్లోజ్ ఫ్రెండ్ రామారావుని. మేమిద్దరం చిన్నప్పటినుండి ఒక్క క్షణం కూడ విడని ప్రాణస్నేహితులం. నాకువన్నెండేళ్ళ వయసు వచ్చేవరకు కలిసిఉండిన మేము తరువాత అనుకోకుండా ఇలా విడిపోవలసివచ్చింది... 'ఇంకా చెప్పబోతున్న అతన్ని ఆపింది కమల

"అబ్బబ్బ ఇప్పుడవన్నీ ఎందుకండీ. చూడమ్మ నీ పేరు నీరా కదూ" అంది

"ఆం అవునవును మా అమ్మాయి నువ్వు ఒకే సంవత్సరంలో రెండు నెలల తేడాలో పుట్టారు! అప్పుడు గోపీ నేను కూడ బలుక్కుని ఇద్దరికీ ఒకేలాంటి పేర్లు పెట్టాలని-మీరా-నీరా-అని పెట్టాం అన్ని విషయాల్లోనూ మాయిద్దరికీ ఒకే అభిప్రాయాలు అన్నట్లు అమ్మాయిలిద్దరికీ పరిచయం కాలేదుకదూ" అంటూ ఇద్దరికీ పరిచయం చేశాడు.

'గ్లాడ్ టు మీట్ యు" అంది మీరా సంతోషంగా నవ్వుతూ.

వెరి వెరి హేపీటు సీయు అందినీరా

డోంట్ యు నో తెలుగు అంది మీరా.

ఆఫ్ కోర్స్ ఐనో అంది నీరా,

ఆతరువాత ఏవేవో విషయాలు మాట్లాడలేక అవును గని చూడమ్మాయ్ మీనాన్నకేమైనా బుద్ధుందా అసలు! నేనిక్కడున్నట్లు తెలియదా వాడికి? ఎవరూ లేనట్లు, దిక్కులేనట్లు హాస్టల్లో తెచ్చిపడేశాడు. చూడునీరా రేపటినుంచి నీ మకాం మాయింట్లోనే తెలిసిందా!

అని ఇంత ఆప్యాయంగా మాట్లాడే ఆత్మీయులున్నారని ముందే తెలిస్తే ఈ రెండు నెలలు యింతబాధ అనుభవించేదా? తనకు వెళ్ళాలనేఉంది కాని పైకి మాత్రం ఎందుకులెండి అంది.

(సశేషం)

ధాతుపుష్టి

కల్గించి, శీఘ్రస్కలనం, మూత్రంలోను, నిద్రలోను వీర్యంపోవుట ఆపి మంచి ఆనందం కలిగించుటకు మకరధ్వజం కలిసినమాత్రలు —పాలతో సేవించే రాజౌషధము పథ్యంలేదు 10 రోజులకు రూ. 12లు పైకం పంపాలి.

డాక్టర్ రత్నం & సన్స్

(ESTD 1904)

మలకపేట బిల్డింగ్సు,
అజంపూరా మార్కెట్ వద్ద,
హైదరాబాద్-36 ఆంధ్రప్రదేశ్.